
ముథోల్ : రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న బలగాలు


నిర్మల్ టౌన్ : సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో రత్నకల్యాణి

# రెండో రోజు ఒక నామినేషన్

- ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్‌లో నామినేషన్లు నిల్

ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్‌లో నామినేషన్లు నిల్

ఎదులాపురం, నవంబర్ 4 : ఆదిలాబాద్, బోథ్ శాసన సభ నియోజకవర్గాలకు రెండో రోజు శనివారం నామపత్రాలు దాఖలు కాలేదని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం సెలవు అయినందున నామినేషన్లు స్వీకరించబడవని తెలిపారు. ఈ నామినేషన్ ప్రక్రియలో 007 ఆదిలాబాద్ ,008 బోథ్ రిటర్నింగ్ అధికారులు బీ స్రవంతి, చాహత్ బాజ్‌పాయ్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోథ్, నవంబర్ 4: బోథ్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన రెండో రోజు శనివారం ఒక్క నామినేషన్ కూడా రాలేదని రిటర్నింగ్ అధికారి చాహత్ భాజపాయ్ తెలిపారు. కొంత మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

నిర్మల్ టౌన్, నవంబర్ 4 : నిర్మల్ నియోజకవర్గ స్థానానికి రెండో రోజూ శనివారం ఒక్క నామినేషన్ కూడ దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రత్నకల్యాణి తెలిపారు. మొదటిరోజు 3 నామినేషన్లు దాఖలు కాగా, రెండోరోజు నామినేషన్లకు ఆర్డీవో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తును పెంచి నిబంధనలు మరింత కఠినతరం చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరిని కూడా లోపలికి అనుమతించలేదు. ఆదివారం ఎన్నికల నామినేషన్‌కు సెలవు కావడంతో సోమవారం నామినేషన్ల ప్రక్రియ వేగం కానున్నట్లు తెలిపారు.

**ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు...**


ఎదులాపురం : రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన అన్ని సమాచారాలను అందించేందుకు కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రత్నకల్యాణి తెలిపారు. ఈ నెల 3వ తేదీన నామినేషన్లతో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ వచ్చే నెల 3న కౌంటింగ్‌తో పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై అన్ని వివరాలు తెలుసుకునేందుకు ఈ కంట్రోల్‌రూం పని చేస్తోందన్నారు. 24 గంటల పాటు పని చేసే ఈ కంట్రోల్‌రూం సెల్ ఫోన్ నంబర్ 7661096808ను కేటాయించామన్నారు.

ముథోల్, నవంబర్ 4 : ముథోల్ ఆర్వో కార్యాలయంలో రెండో రోజు అభ్యర్థులెవరు నామినేషన్లు వేయలేదని రిటర్నింగ్ అధికారి కోమల్ రెడ్డి తెలిపారు. రిటర్నింగ్ కార్యాలయం ముందు బీఎస్ఎఫ్ బలగాలు బందోబస్తును ఏర్పాటు చేశారు.

**రెండో రోజు ఉట్నూర్‌లో ఒకటి..**

ఉట్నూర్, నవంబర్ 3: ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో శనివారం రెండో నామినేషన్ దాఖలైంది. బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డికి తన నామినేషన్ పత్రాన్ని సమర్పించారు.

## ఎన్నికల వ్యయపరిశీలకుడిని కలిసిన ఎస్పీ


వ్యయ పరిశీలకుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్

ఎదులాపురం,నవంబర్ 4 : శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాకు వచ్చిన వ్యయ పరిశీలకుడు ప్రద్యుశీల్ రాంరావ్‌జుంలేను శనివారం స్థానిక పెన్‌గంగ గెస్ట్ హౌస్‌లో ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి కలిశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, భద్రత తీసుకుంటున్న అంశాలను చర్చించారు.

## పులి దాడిలో ఆవులకు గాయాలు

జైనథ్, నవంబర్ 4 : జైనథ్ మండలం కోరట, హత్తీగాట్ పంప్‌హౌజ్ సమీపంలో గల కాలువల్లో నీరు తాగేందుకు వచ్చిన ఆవులపై పులులు దాడి చేశాయి. కోరట గ్రామానికి చెందిన అన్నేల లింగన్న, పాలేపు దేవన్న ఆవులు పులి దాడిలో తీవ్రంగా గాయపడ్డాయి. పది రోజుల నుంచి హత్తీగట్ శివారులో రెండు పులులు సంచరిస్తున్నట్లు పంప్ హౌజ్ అధికారులు తెలిపారు. కాగా రెండు రోజుల క్రితం మహారాష్ట్ర హివిరికి చెందిన రెండు ఎడ్లను గాయపరిచి చంపివేసినట్లు తెలిపారు.

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన ఎల్చల దత్తాత్రేయ


ఎమ్మెల్యే జోగు రామన్నను శాలువాతో సన్మానిస్తున్న దత్తాత్రేయ

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 4: మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ఓయూ జేఏసీ అధ్యక్షుడు తెలంగాణ స్వరాష్ట్రం కోసం ముందుండి పోరాడిన విద్యార్థి ఉద్యమ నాయకుడు, నా కొడుకు సమానుడైన దత్తాత్రేయ తిరిగి మన పార్టీలో చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హృదయపూర్వకంగా స్వాగతం తెలిపారు.

# అభివృద్ధిని కాంక్షిస్తూ గులాబీ గూటికి


బీఆర్ఎస్‌లో చేరిన బోథ్-3 ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోథ్, నవంబర్ 4 : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన వారంటీ లేని గ్యారంటీలను నమ్ముకోకుండా బీఆర్ఎస్ సాధిస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ తెలిపారు. శుక్రవారం రాత్రి బోథ్-3 ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కుర్మె మహేందర్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మేర్గు భోజన్న, బీ నాగేందర్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అబ్రాస్, బోథ్ పట్టణ శాఖ అధ్యక్షుడు అబ్దుల్ ఆసిఫ్, నరేందర్, దోన్ల శేఖర్, ఇమ్రాన్, సాజిత్, అజర్, శ్రీకాంత్, సురేశ్, విక్కి, శివకృష్ణ, ఆసిఫ్, రాజశేఖర్, మల్లేశ్, సుశాంత్, మల్లికార్జున్, సునీల్, జావిద్, ఐవార్, అనాజ్, రియాజ్, ఇస్మైల్‌తో పాటు వందలాది మంది కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేసి ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. బోథ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆర్ సంధ్యారాణి, పీఏసీఎస్ చైర్మన్ కే ప్రశాంత్, సర్పంచ్ జీ సురేందర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

## నగదు పట్టివేత

కుభీర్, నవంబర్ 4 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలం సిర్పెల్లి (హెచ్) సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. మహారాష్ట్రలోని భోఖర్ తాలూకా పాలజ్ నుంచి భైంసాకు వెళ్తున్న రాజేశ్వర్ వద్ద అనధికారికంగా ఉన్నటువంటి రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ ఎండీ షరీఫ్ తెలిపారు.

# సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమం


కాంగ్రెస్ మహిళా నాయకురాలికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్

ఖానాపూర్, నవంబర్ 4 : ఖానాపూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ మహిళ మండలి నాయకురాలు జక్కుల గంగామణితో పాటు పలువురు నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు పైడిపెల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న కేసీఆర్‌కు మరోసారి సీఎంగా పట్టం కట్టడంతో పాటు ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసే విధంగా ప్రజలు దీవించాలని కోరారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, జరిగిన అభివృద్ధిని చూసి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగరావు, సంజీవ్‌రావు, కిషన్, మురళి, సురేశ్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ


ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 4 : తెలంగాణ రోడ్డు రవాణా సంస్థను లాభాల బాటలో నడిపేందుకు ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. సంస్థకు ఆదాయం వచ్చేలా విధులు నిర్వహించిన కండక్టర్, డ్రైవర్, మెకానిక్‌లను అభినందిస్తూ శనివారం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులకు నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(ఓ) ప్రణీత్, డిప్యూటీ ఆర్ఎం(ఎం) ప్రవీణ్‌కుమార్, ఆదిలాబాద్ డీఎం కల్పన, నిర్మల్ డీఎం ప్రతిమరెడ్డి, డీఎం బీఎస్ఎస్ అమృత, ఆసిఫాబాద్ డీఎం శ్రీధర్, మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్, సీఐ విశ్వనాథ్ పాల్గొన్నారు.